




PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం వాగడు - వార్త ఆగదు



సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| గురువారం 27 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక : 86 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|


## కోదాడలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

### ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి,క్షతగాత్రులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



సూర్యాపేట జిల్లా, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలోని కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కంటైనర్‌ను ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, విషయం తెలుసుకున్న కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆసుపత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో మాట్లాడిన ఆయన, గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్యం, అత్యవసర చికిత్స అందించాలని సూచించారు. తీవ్రంగా గాయపడిన వారికి అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్యశాలలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. క్షతగాత్రుల చికిత్స విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు బొల్లం మల్లయ్య యాదవ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటన అత్యంత విషాదకరమని, గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



## కేంద్రం నిధులు ఇవ్వకపోయినా పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

హైదరాబాద్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ఏడాది కాలంగా ఎదురుచూశామని, పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికి ఇప్పటివరకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా 2014 నుంచి 2023 వరకు దాదాపు పదేళ్ల కాలంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ నిర్మాణం జరగలేదని, దీంతో ఇళ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీగా డిమాండ్ ఉందని తెలిపారు. తెలంగాణకు అవసరమైన ఇళ్లను మంజూరు చేయాలని కేంద్రాన్ని అనేకమార్లు కోరామని, కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న నమ్మకంతో పూర్తయిన ఇళ్లకు సంబంధించిన చివరి బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపివేశామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను పలుమార్లు కలిసి తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారని, రెండు వారాల క్రితం తాను కూడా పార్లమెంట్ సభ్యులతో కలిసి కేంద్ర మంత్రిని కలిసి కోరినప్పటికి కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదని మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశ పెట్టుకుని పేద ప్రజలను ఇంకా ఇబ్బంది పెట్టలేమని, ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు చివరి బిల్లు కోసం ఎదురుచూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించకపోయినా పేదవాడి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్వర్తిస్తుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్నప్పటికీ పేదల సొంతింటి కలను నెరవేర్చడాన్ని ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని వెల్లడించారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు కూడా విడతల వారీగా చెల్లింపులు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశతో ఇప్పటికీ ఉన్నామని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, పదేళ్ల కాలంలో సంవత్సరానికి కనీసం పదివేల ఇళ్లను కూడా నిర్మించలేదని మంత్రి విమర్శించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు సుమారు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.



### మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి మాతృమూర్తి దశదిన కర్మకు సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి మాతృమూర్తి శేషమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి శేషమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, రాజేష్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని శేషమ్మకు నివాళులర్పించారు.




## 30 ఏళ్ల సంకల్పం సాకారం.. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభానికి సిద్ధం

అమరావతి, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల కోసం మూడు దశాబ్దాల క్రితం తాను తీసుకున్న సంకల్పం ఇప్పుడు సాకారం అవుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు మొదటి దశను తన చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 31న మార్కాపురం జిల్లా వేదికగా వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ప్రారంభించి, నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎన్నో అవాంతరాలు, సాంకేతిక సమస్యలు, సవాళ్లను అధిగమించి భగీరథ ప్రయత్నంతో వెలిగొండ మొదటి దశ పనులను పూర్తి చేసి కరువు ప్రాంతానికి కృష్ణా జలాలను అందించబోతున్నామని చెప్పారు. ఫేజ్-1 ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు లక్షలాది మందికి తాగునీటి ప్రయోజనం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఫేజ్-2 పూర్తయితే 3.283 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. తరతరాలుగా కరువుతో పోరాడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజలకు వెలిగొండ ప్రాజెక్టు గొప్ప ఉపశమనాన్ని అందించనుందని, దుర్భిక్ష ప్రాంతమైన మార్కాపురానికి వెలిగొండ జలాలు అభివృద్ధికి కొత్త బాటలు వేస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించి పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం ప్రాంతాలను ఉద్యాన పంటల కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. బెంగళూరు-అమరావతి జాతీయ రహదారి, రామాయపట్నం పోర్టు వంటి మౌలిక వసతుల ద్వారా ఈ ప్రాంతంలో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. 1996లో తానే శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును 30 ఏళ్ల తర్వాత తానే ప్రారంభించబోతుండటాన్ని సంకల్పబలానికి ప్రతీకగా చంద్రబాబు అభివర్ణించారు.

## గ్రూప్-1పై సీబీఐ విచారణకు సిద్ధం.. డీఎస్సీపై మీరు సిద్ధమా?



తాడేపల్లి, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: గ్రూప్-1 నోటిఫికేషన్‌పై సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణకు మీరు సిద్ధమా అని తాను విసిరిన సవాల్‌కు సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ తాము ప్రశ్నిస్తుండటంతోనే తమ ప్రభుత్వ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాలపై కూటమి ప్రభుత్వం ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. గ్రూప్-1 అంశంపై సీబీఐ విచారణకు తాము సిద్ధమని స్పష్టంగా చెబుతున్నప్పటికీ, డీఎస్సీ నియామకాలపై కూడా అదే విధంగా విచారణకు సిద్ధమా అని తాను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా అసలు అంశాన్ని పక్కదారి పట్టిస్తూ, వక్రీకరించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. డీఎస్సీ అంశంపై ప్రధానంగా చర్చ జరగాల్సి ఉండగా, దానిని తప్పించుకునేందుకు గ్రూప్-1 అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని ఆయన విమర్శించారు. తమ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, దీనిపై గతంలో నిర్వహించిన విచారణల్లోనూ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని జగన్ పేర్కొన్నారు. అదే సమయంలో డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## ఫీజు బకాయిల విడుదల కోసం బీజేపీ పోరాటం

రామచంద్రాపూర్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన నిరాహార దీక్షకు సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు చేపట్టిన రెండో రోజు నిరాహార దీక్షకు సంఘీభావంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు, సంగారెడ్డి జిల్లా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరాటానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు మద్దతుగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. 'ఫీజు బకాయి–బీజేపీ లడాయి' పేరుతో కొనసాగుతున్న ఈ ఉద్యమం విద్యార్థుల హక్కుల కోసం చేపడుతున్న పోరాటమని నాయకులు పేర్కొన్నారు.



## ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పేదలకు పండ్ల పంపిణీ

అందోల్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: ఈద్ మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని అందోల్-జోగిపేట్‌లో కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఆబేద్ ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోగిపేట్ కోఆప్షన్ సభ్యులు జిసాన్, చోటు ఖాన్, సోహెల్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఆబేద్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ (స) ప్రపంచానికి అందించిన ప్రేమ, కరుణ, దయ, సహనం, సోదరభావం వంటి గొప్ప సందేశాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రవక్త మహమ్మద్ (స) జీవితం యావత్ మానవాళికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పరం మత విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలను గౌరవించుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యువత మంచి ఆలోచనలతో ముందుకు సాగుతూ సమాజంలో శాంతి, మతసామరస్యం, సోదరభావం, మానవత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఇంటా ఆనందం, శాంతి, సుఖసంతోషాలు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మహమ్మద్ ఆబేద్ ఆకాంక్షించారు.



## ఖమ్మం ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్: ఖమ్మం జిల్లా ప్రజలకు మరింత సులభతరమైన, సమర్థవంతమైన ఆధార్ సేవలను అందించేందుకు మమత హాస్పిటల్ రోడ్‌లోని కవిరాజ్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఖమ్మం ఆధార్ సేవా కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన ఆధార్ సేవా కేంద్రంలో అన్ని వయస్సుల వారికి కొత్త ఆధార్ నమోదు, జనాభా వివరాల నవీకరణ, బయోమెట్రిక్ వివరాల నవీకరణ తదితర సేవలను యుఐడీఏఐ మార్గదర్శకాల ప్రకారం అందించనున్నట్లు తెలిపారు. కొత్త ఆధార్ నమోదు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. ప్రజలకు మరింత సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఆదివారాల్లో కూడా ఈ కేంద్రంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని, దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు, ఇతర ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో సేవలను పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఖమ్మం ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం జిల్లాలో ఆధార్ సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు పౌర కేంద్రిత డిజిటల్ సేవల విస్తరణకు మరో ముఖ్యమైన ముందడుగని మంత్రి అన్నారు. ప్రజలకు అవసరమైన గుర్తింపు సేవలను మరింత అందుబాటులోకి, సమర్థవంతంగా, సౌకర్యవంతంగా తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ హన్మంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, యుఐడీఏఐ హైదరాబాద్ డైరెక్టర్ కె.ఎం. భారతి, అసిస్టెంట్ మేనేజర్ పి. రత్నాకర్, బీఎల్ఎస్ ఆధార్ సేవా కేంద్రం రీజినల్ మేనేజర్ కె. శ్రీనివాస్ కుమార్, క్లస్టర్ మేనేజర్ దుగ్గి హరినాథ్, ఆపరేషన్స్ మేనేజర్ పి. సురేష్ కుమార్, ఈడీఎం దుర్గాప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు

మెదక్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ సభల్లో సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపించడంతో పాటు ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకునే అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు నమూనా-6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం నమూనా-7, వివరాల సవరణ కోసం నమూనా-8ను వినియోగించుకోవాలని సూచించారు. ఆచూకీ లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన, రెండు చోట్ల నమోదైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ, వార్డు సభల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని, వాటిలో ఏవైనా తప్పులు గుర్తిస్తే తగిన ఆధారాలతో సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించనున్నట్లు వెల్లడించారు. అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైందని, సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారి ద్వారా ఓటరుకు లేదా వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేస్తారని తెలిపారు. నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం, ప్రదేశంలో ఓటరు స్వయంగా విచారణకు హాజరై అవసరమైన అసలు ధ్రువపత్రాలను చూపించాలని సూచించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు సమీప గ్రామ పంచాయతీ భవనం లేదా వార్డు కార్యాలయంలో విచారణలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల నమోదు అధికారి లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎదుట హాజరై ధ్రువపత్రాలను సమర్పించవచ్చని, భారత ఎన్నికల సంఘం ఓటర్ల సేవల అంతర్జాల వేదిక ద్వారా కూడా సంబంధిత పత్రాలను ముందుగానే జతచేయవచ్చని తెలిపారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. 1987 జూలై 1కి ముందు జన్మించిన వారు ఎన్నికల సంఘం గుర్తించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని, 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లి లేదా తండ్రికి సంబంధించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి అందజేయాలని, 2004 డిసెంబర్ 2 తరువాత జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లిదండ్రులిద్దరి ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. శాశ్వత నివాస, అటవీ హక్కులు, కుల, జనన ధ్రువపత్రాలు, కుటుంబ నమోదుపత్రం, ప్రభుత్వ భూమి లేదా గృహ కేటాయింపు పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, పదో తరగతి లేదా ఇతర విద్యార్హత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డు, పింఛను చెల్లింపు ఆదేశ పత్రం, జాతీయ పౌరుల నమోదుపత్రంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, జీవిత బీమా సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొన్నారు. 2002 ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాతో వివరాలు సక్రమంగా అనుసంధానమైన ఓటర్లు అదనపు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆగస్టు 10లోగా గణన పత్రాన్ని సమర్పించని వారు దావాలు, అభ్యంతరాల స్వీకరణ కాలంలో నమూనా-6తోపాటు నిర్ణీత ప్రకటన పత్రాన్ని అందజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని, పేరు నమోదు కాకపోయినా లేదా వివరాల్లో తప్పులు ఉన్నా సవరణకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు. ఈ ప్రక్రియపై సందేహాలు లేదా సమస్యలు ఉంటే 1950 ఉచిత సహాయ సంఖ్యను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు.

## పటాన్‌చెరులో ఘనంగా జష్నే ఈద్ మిలాద్-ఉన్-నబీ ర్యాలీ



పటాన్‌చెరు, ఆగస్టు 27, సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: జష్నే ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలో మిలాద్-ఉన్-నబీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. వెంకటేశ్వర థియేటర్ వద్ద ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు, యువతకు శీతల పానీయాలు, తాగునీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని, అన్ని మతాలు, వర్గాల ప్రజలు పరస్పర గౌరవం, సహనం, సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. శాంతి, ఐక్యత, మానవత్వం, సమానత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. జష్నే ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు, యువతకు మాద్రి పృథ్వీరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, మిలాద్-ఉన్-నబీ కమిటీ సభ్యులు, యువత, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

మెదక్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ ప్రవేశాలపై రూపొందించిన ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీమోహన్, విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు, మెదక్ జిల్లా టీఓఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎ. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ చదువును మధ్యలోనే నిలిపివేసిన 14
సంవత్సరాలు పైబడిన విద్యార్థులు, యువతీ యువకులకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ విద్యను కొనసాగించే అవకాశం లభిస్తుందని తెలిపారు. విద్యాభ్యాసాన్ని మధ్యలో నిలిపివేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యను కొనసాగించాలని, విద్యార్హతలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు. TOSS అందిస్తున్న ఈ అవకాశంపై అర్హులైన విద్యార్థులు, యువతీ యువకులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు.




## మెదక్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మిలాద్-ఉన్-నబీ వేడుకలు

మెదక్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లా వ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. మెదక్ టౌన్, చేగుంట, శంకరంపేట-ఏ, టేక్మాల్, నార్సింగి, నర్సాపూర్ పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మిలాద్-ఉన్-నబీ వేడుకలు, ప్రార్థనలు, ఊరేగింపులు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. వేడుకలు, ప్రార్థనలు, ఊరేగింపుల సందర్భంగా ప్రజల రాకపోకలు, ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, సున్నిత ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ మిలాద్-ఉన్-నబీ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు జిల్లా పోలీసు శాఖ కృతజ్ఞతలు తెలిపింది. పోలీసులకు సహకరించిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, వేడుకల నిర్వాహకులను అధికారులు అభినందించారు. జిల్లాలో అన్ని పండుగలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించుకుంటూ మెదక్ జిల్లా ప్రశాంతతకు ప్రజలు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.



## PMFME పథకంతో ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు అవకాశం

మెదక్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లా పారిశ్రామిక శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (PMFME) ద్వారా జిల్లాలోని సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ వ్యాపారులు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, రైతులు, ఔత్సాహికులకు ఆర్థిక సహాయం, సాంకేతిక మార్గదర్శకత్వం, వ్యాపారాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జీఎండీఐసీ మేనేజర్ యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే ఉన్న ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల అభివృద్ధితో పాటు అర్హత కలిగిన కొత్త యూనిట్ల ఏర్పాటుకు కూడా ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, ధాన్యాలు, పప్పుదినుసులు, మసాలాలు, బేకరీ ఉత్పత్తులు, పాలు, పాల ఉత్పత్తులు, నూనెగింజల ప్రాసెసింగ్, ఊరగాయలు, జామ్‌లు, పల్ప్, ఎండబెట్టిన ఆహార ఉత్పత్తులు, తక్షణ ఆహార ఉత్పత్తులు తదితర విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల యూనిట్లకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. వ్యక్తిగత సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ యూనిట్లకు అర్హత మేరకు రుణ అనుసంధానిత మూలధన సబ్సిడీ, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సహకార సంఘాలు, ఇతర సమూహ ఆధారిత సంస్థలకు తగిన మద్దతు లభిస్తుందని తెలిపారు. ఆహార ఉత్పత్తుల విలువ జోడింపు, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌తో పాటు బ్యాంకు రుణం, ప్రాజెక్ట్ నివేదిక తయారీ, సాంకేతిక అంశాలు, వ్యాపార ప్రణాళికపై మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డి.ఎస్. అమర్ సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో రైతులు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, యువత తమ ప్రాంతంలో లభించే వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా చిన్నతరహా ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు ప్రాజెక్ట్ ఎంపిక, ప్రాజెక్ట్ నివేదిక తయారీ, యంత్రాల ఎంపిక, విలువ జోడింపు, ప్యాకేజింగ్, మార్కెట్ అనుసంధానం తదితర అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాల కోసం జీఎండీఐసీ మేనేజర్ యాదగిరిని లేదా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డి.ఎస్. అమర్ సింగ్‌ను 9493438347 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. స్థానిక వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సృష్టించడం, ఆహార ప్రాసెసింగ్ ద్వారా ఆత్మనిర్భరత సాధించడమే లక్ష్యంగా పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా పారిశ్రామిక శాఖ కోరింది.

## 22ఏ నిషేధిత జాబితా భూముల బాధితులకు అండగా భారీ నిరసన



పటాన్‌చెరు, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో 22ఏ నిషేధిత జాబితాలో భూములు, ప్లాట్లు, ఫ్లాట్లు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అండగా నిలిచేందుకు అమీన్‌పూర్ వేదికగా భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో పాటు నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ 22ఏ నిషేధిత జాబితాలో భూములు, ప్లాట్లు, ఫ్లాట్లు చేరడంతో అనేకమంది బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బాధితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో అమీన్‌పూర్‌లో నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు. 22ఏ నిషేధిత జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ సప్పన్నదేవ్, శంకర్ యాదవ్, నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మీ సేవా కేంద్రాలే డిజిటల్ మార్కెటింగ్ హబ్‌లుగా మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణలోని ప్రతి మీ సేవా కేంద్రాన్ని డిజిటల్ మార్కెటింగ్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు స్థానిక వ్యాపారులకు తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రచార అవకాశాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని షెరటాన్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ రెండో దశ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 140 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్లు పాల్గొనగా, వారికి 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్త సాంకేతికతను స్వీకరించడంలో తెలంగాణ ఎప్పుడూ ముందుంటుందని, సమర్థవంతమైన పౌర సేవలందించడంలో రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా మీ సేవా కేంద్రాలు ఉన్నాయని, వీటి ద్వారా స్వీట్‌షాపులు, వస్త్ర దుకాణాలు, నైపుణ్య వృత్తిదారులు, ఇతర చిన్న వ్యాపారులకు డిజిటల్ మార్కెటింగ్ సేవలను చేరువ చేసి వారి ఆదాయాన్ని పెంచేందుకు సహకరించవచ్చని తెలిపారు. మీ సేవా కేంద్రాలు కేవలం పౌర సేవలకే పరిమితం కాకుండా ప్రజలకు డిజిటల్ అవగాహన కల్పించి, కొత్త ఆదాయ అవకాశాలను సృష్టించే వేదికలుగా అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో తొలుత పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది వీఎల్ఈలకు డిజిటల్ మార్కెటింగ్, సామాజిక మాధ్యమ ప్రకటనలపై శిక్షణ ఇచ్చామని, శిక్షణ పొందిన వారిలో 10 మందికిపైగా ఇప్పటికే ప్రత్యక్ష డిజిటల్ ప్రకటనల ప్రచారాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. స్థానిక వ్యాపారుల కోసం ఇప్పటివరకు 17కుపైగా ప్రకటనలను రూపొందించి ప్రచురించగా, వీఎల్ఈలకు కొత్త ఆదాయ మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా స్థానిక వ్యాపారులు తక్కువ వ్యయంతో తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసుకునే అవకాశం కలిగిందన్నారు. తొలి దశలో వచ్చిన సానుకూల ఫలితాల నేపథ్యంలో కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. రెండో దశలో ప్రతి జిల్లా నుంచి నలుగురు నుంచి ఐదుగురు వీఎల్ఈలను ఎంపిక చేసి, డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన, ఆసక్తి, స్థానిక వ్యాపారులతో సమర్థంగా పనిచేసే సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన వీఎల్ఈలు తమ జిల్లాల్లో డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా పనిచేస్తూ స్థానిక వ్యాపార అవసరాలను గుర్తించడం, డిజిటల్ మార్కెటింగ్ ప్రయోజనాలను వివరించడం, ప్రకటనల రూపకల్పనలో సహకరించడం, లక్ష్య వినియోగదారులను గుర్తించడం, వ్యాపార విస్తరణకు అవసరమైన సహకారం అందించడం వంటి సేవలను అందించనున్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ, ఐటీ అండ్ సీ శాఖ, మెటా సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీంతో మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ కార్యక్రమంలో సంస్థల భాగస్వామ్యం అధికారికంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మీ సేవా కమిషనర్, ఈఎస్‌డీ అధికారి టి. రవికిరణ్, ఐఎఫ్ఎస్, మెటా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ అరుణ్ శ్రీనివాస్, స్ట్రాటజిక్ ప్రోగ్రామ్స్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్ హెడ్ దివ్య ఖేమాని వధేరా, మీడియా, ట్రావెల్ అండ్ సర్వీసెస్ ఎకోసిస్టమ్ వర్టికల్ హెడ్ రిషాద్ చిందమడ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వ్యాపారులు మీ సేవా కేంద్రాల ద్వారా నేరుగా డిజిటల్ మార్కెటింగ్ సహాయం పొందేలా కొత్త పోర్టల్, టోల్‌ఫ్రీ సేవలను మంత్రి ప్రారంభించారు. meeseva.telangana.gov.in పోర్టల్‌తో పాటు 1100, 1800-425-1110 టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యాపారులకు అందుబాటు ధరల్లో డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలు లభించడంతో పాటు వినియోగదారులు తమ ప్రాంతంలోని ఉత్పత్తులు, సేవలను సులభంగా గుర్తించే అవకాశం ఏర్పడుతుందని, వీఎల్ఈలకు అదనపు ఆదాయ మార్గం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు. శిక్షణ పొందిన ప్రతి వీఎల్ఈ తొలుత ఒక వ్యాపారంతో సేవలు ప్రారంభించి, అనంతరం పది, వంద వ్యాపారాలకు విస్తరించేలా ముందుకు సాగాలని ప్రభుత్వం సూచించిందని తెలిపారు. ప్రతి జిల్లాలో శిక్షణ పొందిన డిజిటల్ మార్కెటింగ్ వీఎల్ఈలు అందుబాటులో ఉండేలా చేసి, ప్రతి స్థానిక వ్యాపారికి తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రచార సహాయం అందించడమే లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

## పేదవాడి ఇంటి కోసం కేంద్రం నిధులు ఇవ్వకపోయినా వెనక్కి తగ్గం

హైదరాబాద్ ఆగస్టు 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి) రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న ఆశతో ఏడాది కాలంగా ఎదురుచూశామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి తెలంగాణకు అవసరమైన గృహాలు, నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో ఉన్నప్పటికీ పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న 15,475 మంది అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల చెల్లింపుల కోసం రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని వెల్లడించారు. ఈ మొత్తాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని, మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు కూడా విడతల వారీగా చెల్లింపులు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పేద ప్రజల ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి సహాయం అందుతుందని ఆశించి చివరి బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపివేశామని, అయితే కేంద్రం తన బాధ్యత నిర్వర్తించకపోయినా పేదవాడి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్వర్తిస్తుందని మంత్రి పేర్కొన్నారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీతో పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2023 వరకు దాదాపు పదేళ్లపాటు గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ నిర్మాణంపై నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించిన మంత్రి, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు సుమారు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేదల సొంతింటి కలను నెరవేర్చే విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.




## వచ్చే 15 రోజులు బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి ఆగస్టు 27 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వచ్చే 15 రోజులు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. వారి ఆధ్వర్యంలో సంగారెడ్డి నియోజకవర్గంలోని బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెన్నెల గద్దర్, ప్రీతం, దయాకర్, చైతన్య తదితరులు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై బీఎల్ఏలకు అవగాహన కల్పించారు. రెండో దశ ఎస్ఐఆర్‌లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలకు బీఎల్ఏలు తప్పనిసరిగా హాజరై ఓటర్ల వివరాలను పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితాలోని ఆబ్సెంట్, షిఫ్టింగ్, డెత్, డూప్లికేట్ (ASDD) ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేయాలని, అనామలిస్ ఓట్లను గుర్తించి వాటిపై సమగ్రంగా పరిశీలన జరపాలని సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో సుమారు 64 వేల ఓట్లపై స్పష్టత వచ్చే వరకు బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమించాలని నాయకులు సూచించారు. ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందని అర్హులైన ఓటర్లకు తప్పనిసరిగా ఫారం-6 అందజేసి వారి ఓటు హక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డెత్ లేదా ఆబ్సెంట్‌గా నమోదైన ఓటర్ల ఇళ్లకు బీఎల్ఏలు స్వయంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో లభిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఓటు వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, వచ్చే 15 రోజులు అత్యంత కీలకమని నాయకులు స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఎల్ఏలకు పూర్తి సహకారం అందించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.




## మెదక్ హెరిటేజ్ టూరిజానికి కొత్త రూపు.. లోగో, బ్రాండింగ్‌తో ప్రపంచస్థాయి గుర్తింపునకు చర్యలు

మెదక్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లా చారిత్రక, పర్యాటక వైభవాన్ని నలుదిక్కులా చాటేలా లోగో, బ్రాండింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన తొలి విడత జిల్లా టూరిజం అభివృద్ధి కమిటీ సమావేశంలో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన 10 అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఏడుపాయల వనదుర్గాభవాని ఆలయ పరిసరాల్లో సుమారు రూ.7 కోట్లతో 12 కాటేజీల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందని, నిర్మాణ బాధ్యతలను పర్యాటక, జిల్లా పంచాయతీ శాఖలకు అప్పగించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మెదక్ కోట అభివృద్ధిలో భాగంగా భద్రతా సిబ్బంది, టూరిస్ట్ గైడ్లు, హౌస్‌కీపింగ్, టికెట్, పార్కింగ్ వంటి సదుపాయాలను మెరుగుపరచాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి స్వాధీనం చేసుకుని పరిరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు రక్షణ కంచె ఏర్పాటు చేసి పార్కింగ్ సౌకర్యాన్ని అభివృద్ధి చేయాలని, ఈ బాధ్యతలను మెదక్ మున్సిపల్ కమిషనర్ చేపట్టాలని కమిటీ నిర్ణయించిందన్నారు. మెదక్ కోట, ఏడుపాయల వనదుర్గాభవాని ఆలయం, పోచారం, వెల్పుగొండ, నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ వంటి పర్యాటక ప్రాంతాల్లో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసి సందర్శకులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు అవసరమైన చోట మొబైల్ ఫుడ్ వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి హెరిటేజ్ శాఖ సూచనల మేరకు మెదక్ కోట సందర్శనకు పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.5 టికెట్ ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా మెదక్ కోట, పోచారం ప్రాంతాలను ఇటీవల కేంద్ర బృందం పరిశీలించిందని, కేంద్రం నుంచి అనుమతులు లభిస్తే సుమారు రూ.100 కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉందని, వాటితో జిల్లా పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి సందర్శకులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఏడుపాయల ఆలయ పరిసరాల్లోని అసైన్డ్ భూములను గుర్తించి ఫుడ్ కోర్టులు, పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటుకు అనుకూలంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మెదక్ కోటను సందర్శించే పర్యాటకులు పైభాగానికి సులభంగా చేరుకునేందుకు బ్యాటరీ వాహనాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.57 లక్షల నిధులతో హెరిటేజ్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.5 లక్షలు, ఇతర మరమ్మతులు, మౌలిక వసతుల కోసం రూ.21 లక్షలు కేటాయించి టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. జిల్లా నుంచి ఐదుగురు టూరిస్ట్ గైడ్‌లుగా శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం వారు శిక్షణ పొందుతున్నారని, శిక్షణ అనంతరం నిబంధనల ప్రకారం నియామకాలు చేపడతామని చెప్పారు. భద్రతా సిబ్బందిని ఏజెన్సీల ద్వారా నియమించేందుకు మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. చారిత్రక ప్రదేశాల్లో శిక్షణ పొందిన గైడ్లను నియమించి పర్యాటకులకు ఆయా ప్రాంతాల చారిత్రక విశేషాలను సమగ్రంగా వివరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. హోమ్‌స్టే కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాలను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి తదుపరి చర్యలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటక, సంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారం, పర్యాటక శాఖ కార్యదర్శి వాణీ ప్రసాద్ సూచనలు, స్వదేశీ దర్శన్ పథకం కింద కేంద్ర నిధుల కోసం ఎంపీ చొరవతో జిల్లాలో పర్యాటక అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతోందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఎఫ్ఓ జోజి, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, పర్యాటక అధికారి రమేష్, ఈడీఎం సందీప్, డీపీఆర్ఓ రామచంద్రరాజు, మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా రాష్ట్ర పర్యాటక శాఖ సహాయ సంచాలకులు ఓంప్రకాశ్, హెరిటేజ్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ డి.మల్లు, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ ప్రమాణాలతో స్వామినారాయణ్ గురుకుల పాఠశాల

ఖమ్మం ఆగస్టు 27 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్) గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు ఖమ్మం, ఉమ్మడి ఖమ్మం జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో రఘునాథపాలెం మండలం జింకలతండాలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్వామినారాయణ్ గురుకుల పాఠశాల ఏర్పాటు కానుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జింకలతండాలో 13.10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న స్వామినారాయణ్ గురుకుల పాఠశాల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి బుధవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వామినారాయణ్ గురుకుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ విద్యాసంస్థలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో పాఠశాల భవనాలు నిర్మించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో కూడిన విశాలమైన క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. విద్యతో పాటు మానవతా విలువలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ విద్యాబోధన కొనసాగుతుందని తెలిపారు. ఆధునిక విద్యతో పాటు విద్యార్థుల్లో భారతీయ విలువలను పెంపొందించేలా గురుకుల్ విద్యా విధానం రూపొందించబడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో స్వామినారాయణ్ గురుకుల్‌కు ఇది ఐదో విద్యాసంస్థ అని మంత్రి తెలిపారు. పాఠశాలలో అందుబాటులో ఉండే మొత్తం సీట్లలో 10 శాతం సీట్లను ఎలాంటి ఫీజు లేకుండా నిరుపేద విద్యార్థులకు కేటాయించే అవకాశం కల్పించామని, ఈ ఉచిత సీట్ల కేటాయింపులో జిల్లా కలెక్టర్‌కు అధికారం అప్పగించినట్లు వెల్లడించారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను ఉచితంగా పొందే అవకాశం లభిస్తుందని మంత్రి తెలిపారు. గిరిజన ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను మరింత చేరువ చేయడమే ఈ విద్యాసంస్థ ఏర్పాటుకు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందని, స్వామినారాయణ్ గురుకుల్ విద్యా విధానం ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యుగంధర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్వామినారాయణ్ గురుకుల్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్: మొక్కలు నాటడమే కాకుండా వాటి మనుగడ, సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్తంభాద్రి ప్రకృతి వనం (వెలుగుమట్ల) అర్బన్ పార్కులో మంగళవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన మహోత్సవాల్లో మొక్కలు నాటడంపై చూపుతున్న శ్రద్ధ వాటి సంరక్షణపైనా చూపాలని, ప్రతి ఒక్కరూ తాము నాటిన మొక్కను బాధ్యతగా కాపాడాలని సూచించారు. అడవుల నరికివేత, పచ్చదనం తగ్గిపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, భవిష్యత్‌లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా, గోదావరి, మున్నేరు నదుల్లో ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేకపోవడం, బయ్యారం చెరువులో నీటి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వచ్చే ఏడాది తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, పచ్చదనం పెరిగితే వర్షపాతం, పర్యావరణ సమతుల్యత మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లలను ప్రకృతి వనాలకు తీసుకెళ్లి వివిధ రకాల చెట్లు, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి పరిశుభ్రమైన, పచ్చని పరిసరాలు ఎంతో అవసరమని, చెట్ల కొరత కారణంగా పర్యావరణ సమస్యలు పెరిగితే ప్రజలు సంపాదించిన డబ్బును వైద్య ఖర్చులకు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. వన మహోత్సవాల సమయంలో మాత్రమే కాకుండా జీవితంలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును పిల్లలు, వృద్ధులు, వాకర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలతో ఆహ్లాదకరమైన వినోద, విశ్రాంతి ప్రదేశంగా అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా వృక్ష ప్రసాదాలను పంపిణీ చేశారు. అంతకుముందు వెలుగుమట్ల పార్కుకు "స్తంభాద్రి ప్రకృతి వనం"గా నామకరణం చేసి లోగోను ప్రారంభించిన మంత్రి, యూనియన్ బ్యాంక్ అందించిన బ్యాటరీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, డీఆర్‌డీఓ శ్రీరామ్, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బేడా (బుడ్గ) జంగం వారికి వెంటనే ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



రాయదుర్గం ఆగస్టు 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి) రాయదుర్గం నియోజకవర్గానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వచ్చిన సందర్భంగా బేడా (బుడ్గ) జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బీ.జే. నాగయ్య ఆయనను కలిసి కుల ధ్రువీకరణ పత్రాల సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీ.జే. నాగయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని బేడా (బుడ్గ) జంగం సమాజానికి చెందిన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఆ వర్గానికి చెందిన విద్యార్థులు, యువత విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో యువగళం పాదయాత్ర సందర్భంగా బేడా (బుడ్గ) జంగం ప్రజల కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను పరిష్కరిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నాగయ్య విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బేడా (బుడ్గ) జంగం సమాజం సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను అత్యంత త్వరలో పరిష్కరించే బాధ్యత తమదేనని హామీ ఇచ్చినట్లు బీ.జే. నాగయ్య తెలిపారు.



# మోతేలో హత్యకు గురైన దంపతుల కుటుంబానికి ప్రభుత్వ అండ: కలెక్టర్

సూర్యాపేట, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: మోతే మండలం బిక్యా తండాలో ఇటీవల దారుణ హత్యకు గురైన దంపతులు నాగులు, బుబా కుటుంబానికి జిల్లా యంత్రాంగం పూర్తి అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ భరోసా కల్పించారు. మంగళవారం బిక్యా తండాలోని బాధిత కుటుంబాన్ని వారు స్వయంగా పరామర్శించి మృతుల కుమార్తెలు జ్యోతి, సంధ్యలను ఓదార్చారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసు కింద ప్రభుత్వపరంగా అందాల్సిన ఆర్థిక సహాయంలో మొదటి విడతగా 50 శాతం మేర రూ.4.2 లక్షలను బాధితుల ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పరిహారం ఉత్తర్వులను కుటుంబ సభ్యులకు అందజేశారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ దంపతుల హత్య ఘటన అత్యంత బాధాకరమని, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడానికే తాము వచ్చామని తెలిపారు. కేసులో పోలీసులు ప్రతి ఆధారాన్ని నిశితంగా సేకరిస్తున్నారని, త్వరగా చార్జిషీట్ సిద్ధం చేసి న్యాయస్థానానికి సమర్పిస్తామని, నేరస్థులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, జంట హత్యల కేసులో నిందితులను ఘటన జరిగిన 24 గంటలు గడవకముందే గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును మరింత లోతుగా, పారదర్శకంగా దర్యాప్తు చేసేందుకు డీఎస్పీ స్థాయి అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించామని, నిందితులను కోర్టు అనుమతితో పోలీస్ కస్టడీలోకి తీసుకుని అన్ని కోణాల్లో విచారించి పక్కా ఆధారాలను సేకరిస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా నిపుణులైన ప్రత్యేక న్యాయవాది సేవలను వినియోగిస్తున్నామని, కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన పరిష్కరించి నిందితులకు కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ వేణుమాధవ్, స్థానిక తహసీల్దార్ వెంకన్న, సీఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఇతర మండల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు, తాగునీరు అందించడంలో విఫలమైన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేయాలి: బొల్లం మల్లయ్య యాదవ్





కోదాడ, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: కోదాడ నియోజకవర్గ రైతులకు వెంటనే సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ సాగునీరు అందించడంలో విఫలమైన నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందించకుండా నల్లగొండ జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు నీటిని తరలిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సాగర్ నీటిని తాగునీటి అవసరాల కోసం విడుదల చేసినప్పటికీ పాలేరు వైపు మళ్లించడం ద్వారా నల్లగొండ జిల్లా ఆయకట్టు రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. వర్షాభావ పరిస్థితులతో రైతుల బోర్లు, బావులు ఎండిపోతున్నాయని, పంట పొలాలు నెర్రలు బారుతున్నాయని, ఈ పరిస్థితుల్లో సాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డెడ్ స్టోరేజ్ స్థాయిలో ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ పనుల విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని, సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల కార్మికుల ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలోనూ ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. నీటిపారుదల శాఖ మంత్రిగా కొనసాగేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నైతిక హక్కు లేదని, వెంటనే రాజీనామా చేసి నల్లగొండ జిల్లా రైతాంగానికి క్షమాపణ చెప్పాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కోదాడ నియోజకవర్గ రైతుల పంటలను కాపాడేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు, ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అధికారులు తక్షణమే నాగార్జునసాగర్ నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.



# సూర్యాపేట జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం

సూర్యాపేట, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, అటవీ భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ భూములకు సంబంధించిన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు త్వరితగతిన పరిహారం చెల్లించాలని, ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.6 వేల కోట్లను విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ల పీడీఎఫ్ ఖాతాల్లో అందుబాటులో ఉన్న నిధులను అర్హులైన లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ప్రాజెక్టులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం సూర్యాపేట జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణ పనుల పురోగతిని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంత్రికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్ఓ ప్రేమ్‌రాజ్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ నాగభూషణం, సూపరింటెండెంట్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: బీజేపీ

కోదాడ, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయే వరకు పోరాటాలను కొనసాగిస్తామని కోదాడ బీజేపీ నాయకులు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన దీక్షకు మద్దతుగా కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.15 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు దీక్షా శిబిరానికి చేరుకుని బీజేపీ నాయకులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంగవీటి శ్రీనివాసరావు, కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, మహేష్, పుల్లారావు, బసవయ్య, ఓరుగంటి పురుషోత్తం, ప్రవీణ్, గణేష్, కళావతి, సీత, జల్లా జనార్దన్, ఈశ్వరరావు, ఎంఎస్ కళాశాల సీఈవో ఎస్.ఎస్.రావు, కళాశాల విద్యార్థులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# వాయిల సింగవరంలో ఘనంగా వన మహోత్సవం–మెగా ప్లాంటేషన్

అనంతగిరి, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: వన మహోత్సవంలో భాగంగా అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అనంతగిరి మండల ఏపీఓ వెంకన్న మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని, పచ్చదనం పెంపొందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కాకర్ల సౌమ్య, గుండ్లపల్లి వెంకన్న, కంటూ వేణు, ఎం. గురవయ్య, చింత సునీత, రాజకుమారి, గోపి, సైదులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవం, VB-G RAM G, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష

సూర్యాపేట, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, VB-G RAM G సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమహోత్సవం, VB-G RAM G కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్ మిషన్ అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో వనమహోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి ప్రతి మండలానికి కేటాయించిన మొక్కల నాటే లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. VB-G RAM G కింద గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను క్షేత్రస్థాయిలో గుర్తించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో పనులను ప్రతిపాదించాలని, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకత, నాణ్యతతో పనులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరే పనులను గుర్తించి వాటి ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత ప్రయోజనం కలిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడంతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు పంచాయతీ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అధికారులు క్రమం తప్పకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వనమహోత్సవం, VB-G RAM G, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలన్నింటినీ ఎంపీడీవోలు, ఎంపీవోలు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పరస్పర సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన ఫలితాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్డీవో పీడీ సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు, డీపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ నోటీసులు వచ్చిన వారు ఆందోళన చెందొద్దు: తహసీల్దార్ కమలాకర్

అనంతగిరి, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఓటరు జాబితాలో వివరాలు మ్యాపింగ్ కాని, చిన్నచిన్న సవరణలు అవసరమైన ఓటర్లకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేస్తున్నామని అనంతగిరి తహసీల్దార్ కమలాకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో మ్యాపింగ్ కాని 155 మంది, వివిధ అనామలీస్ ఉన్న 5,823 మంది ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న ప్రకారం తమ బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) ఎదుట విచారణకు హాజరై ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల ధ్రువపత్రాల్లో తగిన పత్రాలను సమర్పించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ నెల 27న ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కమలాకర్ కోరారు. అలాగే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు, తప్పులు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేసి సవరణలు చేయించుకోవచ్చని సూచించారు.



## స్వర్గీయ బేగరి విట్టల్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు షూస్ పంపిణీ

మెదక్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ స్వర్గీయ బేగరి విట్టల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆయన భార్య పార్వతి, సోదరుడు దామోదర్, కుటుంబ సభ్యులు జయప్రద, వంశీ, భాస్కర్ తదితరులు కలిసి బొడ్మట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి షూస్ పంపిణీ చేశారు. స్వర్గీయ బేగరి విట్టల్ జ్ఞాపకార్థం విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని, విద్యార్థుల పట్ల ప్రేమ, సామాజిక బాధ్యతతో కుటుంబ సభ్యులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ మందిర్, పాఠశాల ఉపాధ్యాయులు లత, కృష్ణ, అశోక్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు. స్వర్గీయ బేగరి విట్టల్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు.





## హర్షవర్ధన్ తేజ మృతికి బాధ్యులెవరు? నారా లోకేష్ సమాధానం చెప్పాలి: యూఎస్ఎఫ్ఐ

శెట్టూరు, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: శెట్టూరు మండల కేంద్రంలోని హాస్టల్ సమీపంలో శిథిలావస్థలో ఉన్న గోడ కూలి ఎనిమిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ తేజ మృతి చెందడం అత్యంత విషాదకరమని, మరో విద్యార్థి అక్షయ గాయపడటంతో విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారెడ్డి అన్నారు. విద్యార్థులు సంచరించే హాస్టల్ పరిసరాల్లో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాన్ని తొలగించకుండా, ముందస్తు భద్రతా చర్యలు ఎందుకు చేపట్టలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్, డే వాచ్‌మెన్ విధుల్లో ఉన్నారా, ప్రమాదకర నిర్మాణంపై గతంలో ఎలాంటి హెచ్చరికలు వచ్చాయి, వాటిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేష్ ఈ ఘటనపై బాధిత కుటుంబానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మృత విద్యార్థి హర్షవర్ధన్ తేజ కుటుంబానికి వెంటనే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, గాయపడిన విద్యార్థి అక్షయకు పూర్తి స్థాయి ఉచిత వైద్యం అందించడంతో పాటు అతని కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఘటనపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి నిర్లక్ష్యానికి కారణమైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో శిథిల భవనాలు, ప్రమాదకర నిర్మాణాలను వెంటనే గుర్తించి తొలగించడంతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, హర్షవర్ధన్ తేజ మృతికి న్యాయం జరిగే వరకు యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని బి. నరసింహారెడ్డి స్పష్టం చేశారు.

## అర్ధరాత్రి వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి బంగారు పుస్తెలతాడు చోరీ.. నిందితుడు అరెస్ట్

మెదక్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కెళ్లిన చోరీ కేసును మెదక్ టౌన్ పోలీసులు ఛేదించారు. మెదక్ పట్టణ ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం సాయి నగర్ కాలనీకి చెందిన బాలెశెట్టి సులోచన (68) ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. ఈ నెల 22, 23 తేదీల మధ్య అర్ధరాత్రి సుమారు 2.40 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి ఆమె ఇంటి తలుపు కొట్టగా, తలుపు తెరిచిన వెంటనే బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల రెండు వరుసల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. సులోచన ఆభరణాన్ని గట్టిగా పట్టుకోవడంతో గొలుసు తెగిపోగా కొంత బంగారం ఆమె చేతిలో మిగిలింది. మిగిలిన ఆభరణాన్ని నిందితుడు లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. ఆమె కేకలు విని పై అంతస్తులో నివసిస్తున్న అల్లుడు కె. లింగగౌడ్ కిందకు వచ్చేలోపే నిందితుడు తప్పించుకున్నాడు. చోరీకి గురైన బంగారు ఆభరణం విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కుమారుడు బాలెశెట్టి సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 378/2026 కింద కేసు నమోదు చేశారు. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బంగారు ఆభరణాల దుకాణాలపై నిఘా పెట్టడంతో పాటు అనుమానితుల కదలికలపై దృష్టి సారించి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి చోరీకి గురైన సుమారు రూ.4.50 లక్షల విలువైన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఎమ్మెల్సీ కోదండరాంకు పరిశోధన గ్రంథం అందజేత



సిద్దిపేట, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: సిద్దిపేట అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జి డాక్టర్ శ్రద్ధానందం తాను రచించిన “Socio-Economic Analysis of Farmer Suicides” అనే పరిశోధన గ్రంథాన్ని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు అందజేశారు. రైతుల ఆత్మహత్యల వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులతో పాటు రైతులను ఆత్మహత్యల వైపు దారితీస్తున్న వివిధ కారణాలను విశ్లేషిస్తూ ఈ పరిశోధన గ్రంథాన్ని రూపొందించినట్లు డాక్టర్ శ్రద్ధానందం తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను కూడా గ్రంథంలో వివరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిశోధన గ్రంథంలోని ముఖ్యాంశాలను ప్రొఫెసర్ కోదండరాంకు వివరించారు. రైతు సమస్యలపై అధ్యయనం, పరిశోధనల ద్వారా వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావడం సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష.. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



వట్పల్లి, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: వట్పల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం స్పెషల్ ఆఫీసర్ సూర్యారావు ఆధ్వర్యంలో మండల స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సేవలు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వాటిని తక్షణమే పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కోరారు. ఎన్నికైన కొందరు సర్పంచుల స్థానంలో వారి భర్తలు కూడా సమావేశానికి హాజరై గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన ఉండాలి

మానూర్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంగారెడ్డి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జ్ ఏఎస్ఐ తులసీరాం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, పని ప్రదేశాల్లో వేధింపులు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఫేక్ ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ వేధింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో 100, 112, సైబర్ నేరాల కోసం 1930, బాలల సహాయం కోసం 1098, సంగారెడ్డి షీ టీమ్ 8712656772 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుల్ చాంగుబాయి, ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి, ఉపాధ్యాయులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల భద్రత, బాలల సంక్షేమం, సైబర్ నేరాల నివారణపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.



## గుంతలమయమైన రహదారులతో ఆటోడ్రైవర్ల అవస్థలు

అల్లాదుర్గం, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: అల్లాదుర్గం చౌరస్తా నుంచి మండలంలోని పలు గ్రామాలు, ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారడంతో ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో ఆటోలు నడపడం కష్టంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల కారణంగా ఆటోలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, ప్రయాణికులను తీసుకెళ్లే సమయంలో ప్రమాదాల భయం నెలకొందని తెలిపారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని పేర్కొన్నారు. రహదారి అధ్వాన పరిస్థితి కారణంగా ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి గుంతలను పూడ్చడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ఆటోడ్రైవర్లు, స్థానికులు కోరుతున్నారు.



## ఐక్యతతో ముందుకు సాగితే మహిళలకు మరింత ప్రయోజనం

నారాయణఖేడ్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్ మండలం ఇందిరానగర్ గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంఘాల బలోపేతం, నిర్వహణ, మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెర్ప్ ఎన్‌పీఎం బీమయ్య, డీపీఎం జాన్ కెన్నడీ, ఏపీఎం శివకుమార్ పాల్గొని మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సంఘ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం, పొదుపు పెంచుకోవడం, అంతర్గత రుణాలను సద్వినియోగం చేసుకోవడం, సంఘ రికార్డులను సక్రమంగా నిర్వహించడం, సభ్యులందరి భాగస్వామ్యంతో నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని సంఘాలను మరింత బలోపేతం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వంశీకృష్ణ, సీసీ కల్పన, సీఆర్‌పీలు సంధ్యారాణి, ప్రమీల, వీఓఏ శంకర్‌నాయక్, వీఓ అధ్యక్షురాలు లక్ష్మితో పాటు ఇందిరానగర్ స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## కృష్ణాష్టమి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న వేణుగోపాల స్వామి ఆలయం

పటాన్‌చెరు, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్: రానున్న శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలను పురస్కరించుకుని పటాన్‌చెరు జేపీ కాలనీలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ ధర్మకర్త, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాకారాలకు రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరిస్తున్నారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలను ఈసారి కూడా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేపడుతున్నామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

## పెద్దారెడ్డిపేట్‌లో ఘనంగా వన మహోత్సవం





పెద్దారెడ్డిపేట్, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ప్రతినిధి మహేష్ బాబు: పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్ గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. "పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" అనే నినాదంతో గ్రామంలో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనం ఎంతో అవసరమని, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే నాటిన మొక్కలను వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ అనసూజ లింగయ్య, ఉపసర్పంచ్ శశికళ, వార్డు సభ్యులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుల తడకగా స్మార్ట్ రేషన్ కార్డులు.. పంపిణీ నిలిపివేత




ఖమ్మం, ఆగస్టు 27, సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపం కారణంగా పలు కార్డుల్లో వివరాలు తప్పుగా ముద్రితమవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. పలు మండలాల్లో మొదటి విడతగా శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టగా, హరిపురం గ్రామంలో పంపిణీ సమయంలో కార్డుల్లో గ్రామాల పేర్లు, గ్రామపంచాయతీల వివరాలు తప్పుగా ముద్రించిన విషయం వెలుగులోకి వచ్చింది. హరిపురం గ్రామానికి బదులుగా ఓదెలగా, రాయగూడెం గ్రామపంచాయతీకి బదులుగా బుద్ధారం, మోటాపురం గ్రామానికి బదులుగా రాజేశ్వరపురం పేర్లు ముద్రించినట్లు స్థానికులు గుర్తించారు. అంతేకాకుండా పలు కార్డుల్లో పోస్టల్ పిన్‌కోడ్ నంబర్లు కూడా తప్పుగా ముద్రితమైనట్లు తెలిసింది. ప్రభుత్వ పథకానికి సంబంధించిన కీలకమైన స్మార్ట్ రేషన్ కార్డుల్లోనే గ్రామాలు, గ్రామపంచాయతీలు, పిన్‌కోడ్ వివరాలు తప్పుగా ఉండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంపిణీకి ముందే సంబంధిత వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తప్పులుగా ముద్రించిన కార్డుల పంపిణీతో భవిష్యత్‌లో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమై పంపిణీని తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు సమాచారం. తప్పులను సరిచేసి, సరైన వివరాలతో స్మార్ట్ రేషన్ కార్డులను తిరిగి పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

